News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :95 | ఖమ్మం | బుధవారం, మే 20, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన

# పూర్తి చేయండి

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షా సమావేశం
- పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం భరోసా ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరాలు 2లో..



## 21 నుంచి సరస్వతి

# అంత్య పుష్కరాలు

- భక్తుల కోసం 3 వేలకు పైగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రాష్ట్రవ్యాప్తంగా 3,360 వాహనాల ఏర్పాటు
- 'సరస్వతి' అంత్య పుష్కరాలకు రావాలని సీఎం, డీప్యూటీ సీఎంకు ఆహ్వానం
- భక్తులకు సేవలు అందించేందుకు 16 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు

హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ స్థలమైన కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు ఈ నెల 21వ తేదీ నుంచి జూన్? 1 వరకు పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడిపేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాంతంలోని హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. వివరాలు 2లో..

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

గరిష్ఠ వయో పరిమితి పెంపు

ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి మరో ఏడాది పొడిగింపు

గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 44 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ

ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితి 44 ఏళ్ల వరకు




హైదరాబాద్

తెలంగాణలో నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయో పరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా జీవో జారీ చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వివరాలు 2లో..

## భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు,

# ఎం777ఏ2 హోవిట్జర్లు

ప్రతిపాదనలకు అమెరికా గ్రీన్ సిగ్నల్

భారత్‌కు కీలక ఆయుధాలు, పరికరాల సరఫరాకు అమెరికా గ్రీన్ సిగ్నల్

అపాచీ సర్వీసుల డీల్ విలువ రూ.1,909 కోట్లు

హోవిట్జర్ నిర్వహణ మద్దతు అంచనా వ్యయం రూ.2,217 కోట్లు





## అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం

# నక్సలిజమే

- వారి త్యాగాల వల్లే మార్చి 31 కంటే ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం
- బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణం
- అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమేనని వ్యాఖ్య

## రైతులను నిండా ముంచిన

# వర్షాలు

- కళ్ల ముందే తడిసిపోతున్నా కాపాడుకోలేని దైన్యం
- రైతులపాలిట శాపంగా మారిన అకాల వర్షాలు
- అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- పిడుగుపాటుకు ఓ రైతుకు చెందిన ఆవు మృతి
- కొనుగోలు కేంద్రంలో తూకం వేసి 100 బస్తాలు దగ్ధం



హైదరాబాద్

అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. కష్టపడి పండించిన పంట అంత తడిసిముద్దైంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కళ్ల ముందే తడిసిపోతుంటే కర్షకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఉరుములు-మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు - మిగతా 3లో

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

- శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని విమర్శ
- పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారు.



# రైతులను నిండా ముంచిన వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

వీచే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజులు గడిచినా కొనుగోళ్లు జరగకపోవడంతో పలుచోట్ల మార్కెట్ యార్డుల్లోని ధాన్యం వర్షానికి తడిచిపోయిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

మెదక్ జిల్లాలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యం తడిచిపోయింది. కొల్చారం, హవేలీ ఘన్?పూర్ మండల కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. ఈదురు గాలులకు జోగిపేట మెదక్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. పిడుగుపాటుతో ఓ రైతుకు చెందిన ఆవు మృతి చెందింది. కామారెడ్డి జిల్లా తాండూరు, మాసంపల్లి, భవానిపేట, మంబాజీపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలి వానకు కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దైంది.

రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవందర్ రెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం లింగారెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద హమాలీల కొరత, లారీల ఇబ్బందులపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. గజ్వేల్ - రామాయంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. మెదక్ మండలం పేరూర్ ఐకేపీ కేంద్రంలో తూకం వేసిన ధాన్యానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఇద్దరు రైతులకు చెందిన సుమారు 100 బస్తాల ధాన్యం కాలిపోయింది. ఇప్పటికైనా



ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

"కేసీఆర్ హయాంలో పంట పండింది. నీళ్లు, రైతుబంధు ఇచ్చాం. పంట కొనుగోలు చేశాం. పైసలు వేశాం. చివరికి అకాల వర్షాలతో తడిసినా కూడా మెలకలు ఎత్తిన వాటిని కూడా కొన్నాం తప్ప ఈ రోజులాగా ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. ఈ ప్రభుత్వంలో మాత్రం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చాలా నష్టపోతున్నారు. అటు రైతుబంధు లేదు, ఇటు పంటకు కరెంట్? సరిగ్గా లేదు. పండిన పంట కొనే పరిస్థితి లేదు. వెంటనే అన్ని కేంద్రాలకు లారీలు పంపించాలి. పంటను కొనాలి"

రైతులను నిండా ముంచిన వర్షాలు

అకాల వర్షాలతో కల్లాల్లో ధ్యానం తడిచిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే తమ కష్టం వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం కూడా వరంగల్? జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షం రైతులను నిండా ముంచింది. పలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. టార్పాలిన్స్ కప్పినా ధాన్యాన్ని కాపాడుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు.గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు. అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు.2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక




స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు.

గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు? లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# రియల్ ఎస్టేట్ లో పుష్పరాజ్

**హైదరాబాద్ :** ఆయన ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు. తన తెలివితేటలతో భారీగా భూములు సంపాదించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో విపరీతంగా భూములు కొన్నారు. ఆ భూములు ఇప్పుడు వేలకోట్ల ఆస్తులు అయ్యాయి. కలెక్టర్ గా ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రికి ఆయన పాదాభివందనం కూడా చేశారు. కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఓ రాజకీయ పార్టీలో చేరారు. ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు.ఇప్పుడు ఆయన చేతిలో ఎన్నో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ దగ్గర ఉన్న ఓ కాస్ట్లీ ప్రాంతంలో ఎకరం భూమిని ఆయన ఏకంగా 100 కోట్లు పెట్టి కొన్నారు. ఇటువంటి కోట్లు ఆయనకు లెక్క కావు. లెక్కలోకి కూడా రావు. ఇప్పుడు ఏకంగా ఆయన దాదాపు పదికి మించిన ప్రాజెక్టులను చేతుల్లో పెట్టుకున్నారు. తెల్లాపూర్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 1500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే తెల్లాపూర్లో మరో చోట 24 ఎకరాల్లో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇందులో ఏకంగా మూడు వేల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో 21 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో కూడా 3500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి.



తెల్లాపూర్ ప్రాంతంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 500 ప్లాట్లు అందుబాటులో వచ్చాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన నియోపోలీస్ ఏరియాలో ఏడు ఎకరాలలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇదే ఏరియాలో 8 ఎకరాల విస్తీర్ణంలో 600 ప్లాట్లు నిర్మించారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, అత్తాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో దాదాపు ఐదువేల ప్లాట్ల విస్తీర్ణంతో బహుళ అంతస్తులను నిర్మించారు. ఒక రకంగా తెలంగాణ రియల్ ఎస్టేట్లో ఒకప్పుడు ఆపర్ణ, మై హోమ్, జనప్రియ వంటి కంపెనీలు నెంబర్ వన్ స్థానంలో ఉండేవి. కానీ ఆ కంపెనీలను ఈ మాజీ కలెక్టర్ కంపెనీ దాటేసింది. హైదరాబాదులోనే దాదాపు పదివేల ప్లాట్ లకు మించిన సామర్థ్యంతో బహుళ అంతస్తులు నిర్మిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే భారీగా భూములను కొనేసింది. ఈ ప్రకారం చూసుకుంటే ఆ మాజీ కలెక్టర్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో పుష్ప రాజ్ లాగా అవతరించే అవకాశం ఉందని బిజినెస్ ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు.ఆయన ఒక పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ.. ఇప్పుడు అధికార పార్టీతో దగ్గరగా ఉంటున్నట్టు తెలుస్తోంది. పైగా అధికార పార్టీలో ఒక కీలక నాయకుడితో ఇటీవల బంధుత్వం కూడా పెంచుకున్నారని సమాచారం. అందువల్లే ఈ స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దూకుడు కొనసాగిస్తున్నారని.. వేల కోట్లను సులభంగా సంపాదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో ఈ మాజీ కలెక్టర్ సిద్ధహస్తుడని మార్కెట్ వర్గాలు చెవులు కోరుకుంటున్నాయి. చూడాలి మరి ఈ మాజీ కలెక్టర్ ఇంకా ఏ స్థాయిలో దూసుకుపోతారో.. ఇంకా ఏ రేంజ్ లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ను తన చేతుల్లో పెట్టుకుంటారో..

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తుకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచటాన్ని హర్షిస్తూ మంగళవారం ఓయూలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ జేఏసీ డాక్టర్ కోటూరి మానవతారాయ్ నేతృత్వంలో నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా సుమారు 40 వేల ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. కొంతమంది వారి రాజకీయ ప్రయోజనాల కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం కృత్రిమ నిరుద్యోగ నాయకుల అవతారమెత్తారని, వారి ఉచ్చులో నిజమైన నిరుద్యోగులు పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు కొప్పుల ప్రతాప్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు రాథోడ్ రవీంద్ర నాయక్, నిరుద్యోగ జెఏసీ నాయకులు జగన్నాథ్ యాదవ్, అశోక్, హేమంత్ చౌదరి, నాగార్జున, దేవ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

-మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేశ్? రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరయ్యారు.

మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మాట్లాడారు.

సమావేశంలో మంత్రులు

పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే రూ.లక్ష కోట్లు కావొచ్చని జూపల్లి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల లభ్యత దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీళ్లు తేవచ్చని, పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల నికర జలాలు సాధించి తీరుతామని తెలిపారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్న ఆయన, కృష్ణా జలాల్లో తెలంగాణకు 62 శాతం వాటాపై హక్కు ఉందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ, వేల టీఎంసీలు తీసుకెళ్లిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డికి త్వరలోనే నీటి కేటాయింపులు సాధిస్తామని, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను కలిశామని చెప్పారు. పాలమూరుకు అధిక నిధులు కేటాయించాలని సీఎంను కోరామన్న ఆయన, ప్రాజెక్టుల పూర్తికి అధిక నిధులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్నారు.

## 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధానమైన హనుమకొండ బస్టాండు నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ పుష్కరాల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు సాధారణ రోజుల్లో ఛార్జీ కన్నా 50 శాతం అధికంగా వసూలు చేస్తారని వారు అన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు.

**సీఎం, డీప్యూటీ సీఎంకు ఆహ్వానం**

మహదేవపూర్? మండలం కాళేశ్వరంలో ఈ నెల 21న ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరు కావాలంటూ సీఎం రేవంత్ ?రెడ్డి, భట్టి విక్రమార్కను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ డైరెక్టర్ హనుమంతరావు ఆహ్వానించారు.

**30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం**

కాళేశ్వరం పుష్కారలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్?బాబు పేర్కొన్నారు. పుష్కారాలకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్? కె.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో సచివాలయంలో ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ ?బాబు మాట్లాడుతూ ఈ నెల 21న ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పుణ్యస్నానం ఆచరించి అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి పుష్కరాలకు దాదాపు 30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భక్తుల కోసం మౌలిక సౌకర్యాలు ఏర్పాటు**

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారని పేర్కొన్నారు. ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇవన్నీ జూన్? 1న ముగియనున్న పుష్కరాలకు విస్తృతమైన మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని సీఎస్? పేర్కొన్నారు. ఈ పుష్కరాల్లో భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, శానిటేషన్, ట్రాఫిక్, రవాణాను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, డైరెక్టర్ హనుమంతరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు నవీన్ మిత్తల్, ముకుంద్‌రెడ్డి, అనితా రామచంద్రన్, హరీశ్, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.

**పుష్కరాల్లో భక్తుల ఆరోగ్యమస్తు!**

అంతేకాకుండా కాళేశ్వరం త్రివేణి సంగం పుష్కరాల్లో భక్తులకు సేవలు అందించేందుకు వైద్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ 12 రోజుల పాటు సాగే ఈ మహా వేడుకలను లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కొత్త కార్యచరణ చేసింది. అక్కడికి వచ్చిన వారు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 16 వైద్య శిబిరాలు, 576 మంది సుశిక్షితులైన సిబ్బంది, 18 మంది ప్రత్యేక వైద్య నిపుణులను రంగంలోని దింపనుంది. మొత్తం 16 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్? ప్రధాన క్యాంప్?, కాళేశ్వరం పీహెచ్?సీ ప్రధాన క్యాంప్?, పాత ఈవో కార్యాలయం, దేవాలయ ప్రధాన ద్వారం, పార్కింగ్? ఏరియా-1, టెంట్? సిటీ, పార్కింగ్? ఏరియా-2, తాత్కాలిక బస్టాండ్?, పాత బస్టాండ్?, గోదావరి ప్రధాన ఘాట్?, హరిత హోటల్?, సరస్వతీ ఘాట్? నదీ తీరం, గంగారపు క్రాస్? రోడ్?, అన్నారం కెనాల్?, కాటారం పీహెచ్?సీ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పారామెడికల్? సిబ్బందికి బస, మందుల భద్రతకు స్టోరేజ్? గదులు కేటాయించారు.

## పారిశ్రామిక వాడలో అగ్నిప్రమాదం.. పేలిన రియాక్టర్లు

**హైదరాబాద్:** మేడ్చల్ పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్లు పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి.దీంతో చుట్టుప్రక్కల ప్రాంతాలకు దట్టమైన పొగ వ్యాపించింది. వివరాలు తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో అక్కడి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.



## భద్రాచలంలో భారీగా ఎండు గంజాయి స్వాధీనం....



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 19,భద్రాచలం -- కూనవరం రోడ్ ఇసుక ర్యాంపు వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. మొత్తం 15.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, డి పి ఈ ఓ ఎస్. జనయ్య ఆదేశాల మేరకు భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ రహీమున్నీసా బేగం ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

అనుమానాస్పదంగా వచ్చిన నాలుగు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. ఈ సందర్భంగా నాలుగు బైకులు మరియు ఐదు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ఈ కేసులో ఖమ్మం, ఇల్లందు ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఖమ్మం మరియు ఇల్లందు ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తనిఖీల్లో ఎస్ ఐ అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుళ్లు కరీం, విల్సన్, కానిస్టేబుళ్లు సీతారామ్, రవి, వీరభద్రరావు, శ్రవణ్, రాకేష్, కిరణ్, మనోహర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2523 కు సమాచారం అందించాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్ హెచ్ ఓ రహీమున్నీసా బేగం తెలిపారు.

## ట్రైబల్ మ్యూజియం సందర్శించిన గిరి దర్శక్ బృందం....




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 19,భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంలో పొందుపరిచిన కళాఖండాలు చాలా అద్భుత ఉన్నాయని, గిరిజన అభివృద్ధి కొరకు పాటుపడడమే కాక వారి సంస్కృతిని ప్రతిబింబించేలా మ్యూజియం రూపకల్పన చేసిన ఐటీడీఏ బి రాహుల్ ను అభినందిస్తున్నట్లు గిరి దర్శక్ రోల్ టూరిస్ట్ గైడ్ ఉబ్బమోహన్రావు అన్నారు.

మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హెడ్ క్వార్టర్ లో పౌర రక్షక శాఖ ఆధ్వర్యంలో గిరిదర్శక్ శిక్షణ పొందుతున్న గిరిదర్శక్ బృందం టూరిస్ట్ గైడ్ సభ్యులు శిక్షణలో భాగంగా గిరిజన మ్యూజియంను సందర్శించారు. మ్యూజియంలోని ఆదివాసీలకు సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలను మరియు కళాకృతులను మరియు గిరిజన క్రాఫ్ట్ తయారీ విధానాన్ని వారు పరిశీలించినారు. మారుమూల ఆదివాసి గిరిజనుల యొక్క పురాతన వస్తువులను సేకరించి ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భావితరాల కు తెలిసే విధంగా మ్యూజియంలో పొందుపరచడం చాలా బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. ఆహార సేకరణకు ఉపయోగించే వస్తువులు మరియు నీళ్లకు ఉపయోగించే సొరకాయతో చేసినటువంటి సొరకాయ బుర్రలు బాగున్నాయని, ఆదివాసులు ఆధునిక పోకడలకు పోకుండా పర్యావరణాన్ని కాపాడే వస్తువులను నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్చార్జి వీరాస్వామి,మాధవి, స్రవంతి, సందీప్ కుమార్, ఉదయ్ కుమార్, రవి, ముత్యాలరావు, దేవా, వర్ష సందీప్, అపక సాంబ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు పర్మిషన్ ఇవ్వాలని ఎస్సైకి వినతి పత్రం, అందజేసిన వివోఏలు



మే 19 (సీ కే న్యూస్) చేగుంట:రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, వివోఏ ల రాష్ట్ర కమిటీ మేరకు మే 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవదిక సమ్మె చేపట్టినట్లు చేగుంట వివోఏ ల సంఘం సభ్యులు ప్రకటించారు మంగళవారం స్థానిక ఎస్ ఐ చైతన్య కుమార్ కి కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. తమకు మద్దతు ఇవ్వాలని అన్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న విఓఏ లకు : కనీస వేతనం 20000వేలకు పెంచాలని.ఆరోగ్య హెల్త్ పాలసీ , పదోన్నతులు ఆరోగ్య బీమా, ట్యాబ్ స్వాకర్యం

కల్పించాలనివిన్నవించారు .న్యాయమైన డిమాండ్ లు తీర్చాక పోతే వెనక్కి తగ్గేది లేదని తెలిపారు, ఈ కార్యక్రమం లో అవుబోతు స్వామి, భానుప్రయ్, కవిత, హారిక, అరుణ, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న ఆవేదన, ధాన్యం వద్ద రాత్రి పగలు పడికాపుల కాస్తున్న రైతగం,



మే 19 (సీ కే న్యూస్) చేహుంట:చేగుంట మండల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, కల్లాల్లోనే ధాన్యం తడిసిపోతోందని రైతులు వాపోతున్నారు.

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:

కొనుగోళ్లలో జాప్యం: కేంద్రాలు తెరిచినా టోకెన్లు ఇవ్వడం లేదని, ఇచ్చినా వారాల తరబడి కాంటాలు కావడం లేదని ఆరోపణ.

"10 రోజుల నుంచి కల్లంలోనే పడిగాపులు కాస్తున్నాం. నిన్న వర్షానికి 20 బస్తాలు తడిసిపోయాయి" – మహబూబ్‌నగర్ రైతు నరసింహ

తేమ శాతం పేరిట కోతలు: 17% కంటే ఎక్కువ తేమ ఉందని క్వింటాకు 200–300 రూపాయలు కోత విధిస్తున్నారని ఆవేదన. కానీ అకాల వర్షాల వల్ల తేమ పెరుగుతోందని రైతులు చెబుతున్నారు.

గన్నీ బ్యాగుల కొరతలి: కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు లేకపోవడంతో రైతులు సొంత డబ్బులతో బయట కొనుక్కుంటున్నారు. ఒక్కో సంచి 30–40 రూపాయలు అవుతోంది.

ఆన్‌లైన్ టోకెన్ సమస్య: టోకెన్ కోసం సర్వర్ డౌన్, ఓటీపీ రాకపోవడం, గ్రామ సేవకుల వద్ద అవినీతి జరుగుతోందని ఫిర్యాదులు.

చెల్లింపుల జాప్యం: ధాన్యం ఇచ్చిన 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో పడాల్సి ఉండగా, 15–20 రోజులైనా జమ కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందన:

వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ "అకాల వర్షాల వల్ల ఇబ్బందులు వచ్చాయి. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాం. కోతలు విధించవద్దని ఆదేశాలు ఇచ్చాం. 24 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు.

రైతు సంఘాల డిమాండ్లు:

తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోత లేకుండా కొనుగోలు చేయాలి

ప్రతి గ్రామంలో అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గన్నీ బ్యాగులు ఉచితంగా సరఫరా చేయాలి

48 గంటల్లో చెల్లింపుల పూర్తి చేయాలి

రాష్ట్రంలో ఈ యాసంగిలో 1.2 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటివరకు కేవలం 30% మాత్రమే కొనుగోళ్లు పూర్తయ్యాయి. వర్షాలు మరింత పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు మొరపెట్టుకుంటున్నారు తక్షణమే ధాన్యం కొనుగోలు త్వరగా సేకరించాలని వారు కోరారు,

## పకడ్బందీగా జనగణన సర్వే నిర్వహించాలి..



- ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి.
- జిల్లా కలెక్టర్ అంకిత్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 19,అశ్వాపురం మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పలు కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. మల్లెలమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న సెన్సస్--2027 జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం, సీతారాంపురం లోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ కూడా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

మల్లెలమడుగు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లతో కలెక్టర్ మాట్లాడి, వివరాల నమోదు విధానం, డేటా సేకరణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో జరుగుతున్న 16వ జనగణన ఇదేనని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి జనగణన కావడం విశేషమన్నారు. ఈసారి తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు.

జనగణనలో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఒక్కో కుటుంబానికి సంబంధించిన వివరాలను సుమారు ఐదు నిమిషాల్లోనే నమోదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఎన్యూమరేటర్ల ఐడీ కార్డులపై ఉన్న (క్యూ ఆర్ ) కోడ్‌ను స్కాన్ చేస్తే వారి పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు అధికారిక సిబ్బందికి సహకరించి ఖచ్చితమైన సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార సేకరణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి ఇంటిని కవర్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిన్నటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, ప్రస్తుతం ఉన్న నిల్వలు, రైతుల నుంచి ధాన్యం రాక పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రస్తుతం కేంద్రంలో 5,550 ధాన్యం బ్యాగులు నిల్వలో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

కొనుగోలు కేంద్రానికి మ్యాపింగ్ చేసిన రైస్ మిల్లుల వివరాలు, ధాన్యం తరలింపు ప్రక్రియ, లోడింగ్--అన్‌లోడింగ్ పరిస్థితులు, లారీల లభ్యత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం, రికార్డు నమోదు, నిల్వ, రవాణా వంటి ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా ధాన్యం పేరుకుపోకుండా మిల్లులకు సకాలంలో తరలించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ధాన్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ తేమ శాతం, శుభ్రత, నిల్వ విధానం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల మేరకు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడారు. బీహార్ రాష్ట్రం నుంచి వచ్చిన హమాలీల పని పరిస్థితులు, వసతి, తాగునీరు, ఆహారం తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, దిగుబడి పెంపు, సాంకేతిక సూచనలు గ్రామస్థాయిలో అందించేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక సాగు విధానాలను అవలంబించాలని కలెక్టర్ అన్నారు.

అనంతరం అశ్వాపురం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న శివసాయి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ సామర్థ్యం, స్టాక్ వివరాలు, మిల్లింగ్ ప్రక్రియపై మిల్ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రైస్ మిల్లులో సుమారు 6,000 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో ఉన్నట్లు మిల్ సిబ్బంది వివరించింది.

మిల్లులో ధాన్యం నిల్వ విధానం, భద్రతా చర్యలు, రికార్డు నిర్వహణ, తరలింపు ప్రక్రియలను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులు అమ్మిన ధాన్యం వేగంగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, నిల్వలు పేరుకుపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా మరియు వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.

ఈ పరిశీలనలో సర్పంచ్ మర్రి సంధ్యారెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, తాసిల్దార్ సూర్యప్రకాష్, వ్యవసాయ శాఖ ఏడి తాతారావు, ఏఎస్ఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐ లీలావతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సీ కే న్యూస్ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బాదిగూడ గ్రామంలో గిరిజనులు బుడ్ బావై పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆదివాసి గూడాల్లో కప్ప తల్లి శనివారం ఆట ఆడారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుకుంటు మిరుగుకు వారం రోజుల ముందు నుండి ఈ బుడ్ బావై గూడల్లో నిర్వహిస్తారు. ఓ రోకలికి కప్పను కట్టి, పిల్లలు నడుముకు, కాలికి గజ్జెలు కట్టుకొని, కప్పను కట్టిన రోకలిని భుజాన మోసుకుంటూ నృత్యాలు చేస్తూ ఇంటింటికి తిరిగుతూ కప్పతల్లికి స్నానం చేయించారు. చిన్నారులు కప్పతల్లితో ఇంటి ముందుకు రాగానే మహిళలు రోకలి కట్టిన కప్పపై నీళ్లు పోసి అభిషేకం చేస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడం లక్ష్మికాంత్, దేవరి పేందూర్ బండి, పెందూర్ రెడ్డి, పేందూర్ నాగు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)




సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా:ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పోలీసు శాఖకు మరింత బలం చేకూర్చాలని ఆకాంక్ష వనపర్తి, మే 19:వనపర్తి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ రాజేష్ మీనా, ఐపీఎస్., మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్.,ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇటీవల ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో చేరిన జిల్లా ఎస్పీను ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ, వనపర్తి జిల్లాకు యువ ఐపీఎస్ అధికారిగా అదనపు ఎస్పీ (అడ్మిన్) బాధ్యతలు చేపట్టడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత, విధుల పట్ల కర్తవ్యనిష్ఠ, సమర్థ నాయకత్వ లక్షణాలతో జిల్లా పోలీసు శాఖకు మరింత బలాన్ని చేకూరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గద్వాల్: మృతదేహం విషయంలో డాక్టర్, ఎస్ఐ మధ్య వాగ్వాదం...








సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న. గద్వాల నియోజకవర్గం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందగా.. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే మార్చురీలో ఫ్రీజర్లు పనిచేయడం లేదంటూ మృతదేహాన్ని స్వీకరించేందుకు డ్యూటీ డాక్టర్ నిరాకరించారు. దీంతో డాక్టర్,ఎస్ఐ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరకు అధికారులు జోక్యం చేసుకోవడంతో మృతదేహన్ని భద్రపరిచారు.

# సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం...



**వర్గ పోరాటాలు, సామాజిక పోరాటాలు సాగించడమే సుందరయ్యకిచ్చే ఘన నివాళి.**

**సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు....**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 19,**వర్గ పోరాటాలు సామాజిక పోరాటాలు సాగించడమే సుందరయ్యకు మనమిచ్చే ఘన నివాళి అని సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ జీవి అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య తన కుటుంబం నుండి వర్గ,సామాజిక పోరాటం ప్రారంభించారని అన్నారు. మూడ ఆచారాలకు, నమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేశారని అన్నారు. బహుముఖ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పార్టీ నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. యువత విప్లవ రాజకీయాల వైపు ఆలోచించాలని ఆదర్శవంతమైన రాజకీయాలు కమ్యూనిస్టులతోనే సాధ్యమని అన్నారు. దేశంలో బిజెపి రాజకీయ కుట్రల ద్వారా, ఎలక్షన్ కమిషన్, ఈ డి, సి బి ఐ మొదలగు రాజ్యాంగ యంత్రాంగాన్ని ఉపయోగించుకొని అధికారంలోకి వస్తుందని అన్నారు. కమ్యూనిస్టుల పని అయిపోలేదని మరిన్ని పోరాటాల ద్వారా ముందుకు సాగుతామని అన్నారు. బిజెపి మతోన్మాద ముప్పు నుండి దేశాన్ని కాపాడడం కోసమే తమిళనాడులో టీవీకె పార్టీకి కమ్యూనిస్టులు మద్దతు ఇచ్చారని అన్నారు. కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల దేశ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతోందని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో ప్రజా పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు..


సుందరయ్య స్ఫూర్తితో స్థానిక సమస్యలపై పోరాటాలు సాగించాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి.

రాజకీయ పోరాటంతో పాటు స్థానిక సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించడమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు మనం ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో వైఫల్యం చెందుతుందని తక్షణమే హామీలు అమలు చేయాలని ఆయన అన్నారు. భద్రాచలం పట్టణాభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఐదు పంచాయతీలను వెంటనే భద్రాచలంలో కలపాలని కరకట్ట అభివృద్ధికి నిధులు కేటాయించాలని అందుకు ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో స్థానిక సమస్యలు పెరిగిపోయి ఉన్నాయని ఆ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించడమే సుందరయ్యకు మనమిచ్చే నివాలని అన్నారు. సభకు ముందుగా సుందరయ్య చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పూలమాల వేయగా పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ యలమంచి సీతారామయ్య చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, వార్డ్ మెంబర్ బందారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు, పి సంతోష్, కుమార్, డి సీతాలక్ష్మి వార్డు మెంబర్ ఇరప అనసూయ, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, నకిరేకంటి నాగరాజు, చుక్క మాధవ రావు, యు జ్యోతి, ఎస్ అజయ్ కుమార్, జీవనజ్యోతి, ధనకొండ రాఘవయ్య, కొలగాని రమేష్,కుంజా శ్రీనివాస్, కనక శ్రీ, సంద్ర భూపేంద్ర, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ, డివైఎఫ్ఐ నాయకులు డి సతీష్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర, డి రామకృష్ణ,కుంజా విజయ, జి ఝాన్సీ,వై పూర్ణిమ, అల్లాడి సత్యవతి కాక రమణ రాయల రాములు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులపై వేధింపులు ఆపాలి

- అశ్వారావుపేట ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన..
- ఆర్ఎంపీ--పీఎంపీ సిపి ఈ పి సంఘం నాయకుల వినతి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 19,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ వైద్యులపై జరుగుతున్న రైడింగ్‌లు, జరిమానాలను నిలిపివేయాలని టీఎస్ ఆర్ఎంపి పిఎంపి సి పి, ఈపీ సంఘం నాయకులు సోమవారం నాడు అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ను నియోజవర్గ కేంద్రంలో కలిసి వినతి పత్రం ఇచ్చి కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ శశికళ, వైస్ చైర్‌పర్సన్ జూపల్లి రమేష్‌లను కూడా సంఘ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యవరపు జగదీష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి టి. రామదాసు, జిల్లా ఖజాంచి టి. కృష్ణతో పాటు జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తూ అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నామని తెలిపారు. తమ పరిధి దాటి వైద్యం చేయవద్దని సూచిస్తే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. పెద్ద కేసులను ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పల్స్ పోలియో వంటి ప్రభుత్వ వైద్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలను భాగస్వామ్యం చేయాలని కోరారు. మెడికల్ అధికారులు వచ్చినప్పుడు పూర్తి సహకారం అందిస్తామని, మొదటిసారి సూచనలు ఇచ్చి, అదే తప్పు పునరావృతమైతే మాత్రమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మండలంలో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలోని నేరడ రామకృష్ణాపురం బస్వాపురం నరసింహపురం రేపల్లెవాడ పాతర్లపాడు గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల నాయకుల అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో కార్యకర్తలను సభ్యత్వ నమోదు చేయనున్నట్లు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పారదర్శకత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పూర్తిగా మొబైల్ యాప్, ఆన్లైన్ విధానంలో డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
చింతకాని మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి 50 బూతులు ఉన్నాయి బూత్ కి ఇద్దరు చొప్పున 100 మంది ఎంపిక చేయటం జరుగుతుంది తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పర్యవేక్షణ కోసం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులను జిల్లా, నియోజకవర్గాల వారీగా ఇన్చార్జ్‌గా నియమించినట్లు వెల్లడించారు. స్థానిక స్థాయిలో సభ్యత్వ నమోదు విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంకెన రమేష్,
బోడు వెంకట రామారావు గురజాల హనుమంతరావు గడ్డం శ్రీనివాసరావు. పిన్నెల్లి శ్రీనివాసరావు కోమట్ల గూడెం సర్పంచ్ పరిశుద్ధ రావు. మాజీ సర్పంచ. కన్నబోయిన కుటుంబరావు.సా మినేని అప్పారావు.బంధం కృష్ణ మండే పూడి కృష్ణ ప్రసాద్ నన్నాక గోవిందరావు. నన్నక నరసింహారావు. మాజీ సర్పంచ్ చాట్ల సురేష్ బొగ్గరపు.రాంబాబు.
తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు రవాణాలో కేసిహెచ్‌పిది కీలక పాత్ర.



**మల్టీ- డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్, మణుగూరు (జిఎం),**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 19,**మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టి డిపార్ట్మెంట్ బృందం మణుగూరు ఏరియా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమలలో భాగంగా మంగళవారం నాడు మల్టి డిపార్ట్మెంట్ బృందం తనిఖీ బృందం మణుగూరు ఏరియా కేసిహెచ్‌పిను సందర్శించి ఉద్యోగులకు, అధికారులకు మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడశీ జరిగింది.

ఈ అవగాహన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్టీ- డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్ (జిఎం) ముందుగా కేసిహెచ్‌పిలో ప్రసంగిస్తూ... బొగ్గు రవాణాలో కేసిహెచ్‌పి కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి బొగ్గు సరఫరాలో, రవాణాలో ఎలాంటి ఆటంకం కలుగకుండా యంత్రాల పనితీరును అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలి. కేసిహెచ్‌పి పని తీరు ప్రతిక్షణం ఎంతో విలువైనది కాబట్టి బ్రేక్ డౌన్ జరిగే అవకాశాలను ముందుగానే పసిగట్టి వెంటనే తగు చర్యలు తీసుకోవడం అలాగే ఏదేని కారణం వల్ల బ్రేక్ డౌన్ జరిగిన ఎడల వెంటనే మరమ్మత్తులు జరిపేందుకు సంబందిత అదనపు పరికరాలు ముందస్తుగానే సిద్ధంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా బొగ్గు రవాణాలో వినియోగదారులకు సంతృప్తి కలిగేలా నాణ్యమైన బొగ్గును అందించేందుకు సెల్ పిక్కింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే నిత్యం బొగ్గు లోడింగ్ ప్రక్రియలో పాల్గొనే కార్మికుడు, సుపర్వైజర్లు ఎల్లపుడూ పూర్తి స్థాయిలో రక్షణ పరికరాలు ధరిస్తూ, రక్షణ పరిధిలో పని చేయాలి. అలాగే దుమ్ము, ధూళి మరియు వాయు కాలుష్యం తో ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతినకుండా అనునిత్యం కేసిహెచ్‌పి ప్రాంగణంలో, పరిసరాలలో వాటర్ స్ప్రేయింగ్ చేస్తుండాలని సూచించారు. అలాగే వాయు కాలుష్య నివారణలో వృక్షాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి కాబట్టి కేసిహెచ్‌పి పని ప్రదేశాలలో, పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలను నాటి వాటిని పరిరక్షిస్తూ వృక్ష్య సంపదను పెంచేందుకు కృషి చేయాలని తెలియజేశారు. కేసిహెచ్‌పి నుండి నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాలను సాధించడానికి ఉద్యోగులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అలాగే కేసిహెచ్‌పి పరిసర ప్రాంతములను పరిశుభ్రముగా మరియు పర్యావరణానికి మెరుగుపర్చడానికి తగిన చర్యలు తీసుకుంటునందుకు కేసిహెచ్‌పి అధికారులను మరియు ఉద్యోగులను జివిఎం అభినందించారు. మణుగూరు ఏరియా కేసిహెచ్‌పి వార్షిక బొగ్గు రవాణా లక్ష్యం గురించి పవర్ పాయింట్ ప్రేసెంటేషన్ ద్వారా వివరిచారు.
అలాగే ఈ రోజు 2వ షిఫ్ట్ లో పికేఓసి?-×ం నందు ఉద్యోగులతో మాట్లాడుతూ.. 2026-27 సంవత్సరంలో మణుగూరు వార్షిక ఉత్పత్తి లక్ష్యమైన 96.26 లక్షల టన్నులు మరియు సింగరేణి వ్యాప్తంగా 65 మిలియన్ టన్నులను సమిష్టి కృషితో సాధిశీచాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రక్షణతో సాధిశీచడానికి చిత్తశుద్దితో కృషి చేయాలని సూచిస్తూ కంపెనీ ముందున్న సవాళ్ళు మరియు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా తదితర అంశాల పై పవర్ పాయింట్ ప్రేసెంటేషన్ ద్వారా కూలంకషంగా వివరించడం జరిగింది. సింగరేణి వ్యాప్తంగా మరియు మణుగూరు ఏరియాకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా మరియు ఓబిగ వెలికితీత వివరాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి , ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, పీఓ పీకేఓసీ ఎం. శ్రీరమేశ్ , ఏజిఎం(ఐఈడ్సీ) సిహెచ్. రాంబాబు , ఏజీఎం(పర్సనల్) ఎస్. రమేశ్ , డిజిఎం(కేసిహెచ్‌పి) వి.మధన్ నాయక్, ఆర్.ఎస్. గౌడే , డిజిఎం(క్వాలిటీ) నాగ రమేశ్ , ఓసి-4 మేనేజర్ రమణారెడ్డి , ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ మరియు ఇతర అధికారులు, అలాగే గుర్తింపు సంఘం ( ఏఐటియుసి) బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్ , ప్రాతినిధ్య సంఘం( ఐ ఎన్ టి యు సి) వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, డిజిఎం(కేసిహెచ్‌పి) వి.మధన్ నాయక్ , ఓసి -2 సంక్షేమ అధికారి చంద్రకిరణ్ మరియు కేసిహెచ్‌పి ఫస్ట్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్, ఓసిశ-×ం సెకండ్ షిఫ్ట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ లబ్ధిదారులు.. ఆధార్ తో పేర్లు నమోదు చేసుకోవాలి.

- సర్పంచ్ నారగాని రాంబాయి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ పంచాయతీలోని పెన్షన్ లబ్ధిదారులు, ఆధార్ తో తమ యొక్క పేర్లను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని నాగులవంచ గ్రామ పంచాయతి సర్పంచ్ నారగాని రాంబాయి గ్రామ ప్రజలకు తెలియ చేశారు.
నాగులవంచ గ్రామపంచాయతీ పరిధిలోని వృద్ధాప్య, వికలాంగుల,వితంతు,ఒంటరి మహిళ ల పెన్షన్ లబ్ధిదారులు తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని
సూచించారు.ఈ ప్రక్రియ ఈ నెల 15 నుండి వచ్చే జూన్ నెల 5 వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని ప్రతి పెన్షన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి రాలేని వారు కార్యదర్శి కి సమాచారం అందిస్తే ఇంటి వద్దకే వచ్చి నిర్ధారణ చెయ్యడం జరుగుతుందన్నారు.
ఆధార్ కార్డ్ వెరిఫికేషన్ చేయించుకోని వారి పెన్షన్లు ప్రభుత్వం నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు.ఇట్టి విషయాన్ని గమనించి పెన్షన్ దారులు సహకరించాలని కోరారు.

# ఇండోన్మెంట్ స్థలం పరిశీలన



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలోని వందనం.గ్రామంలోని ఇండోన్మెంట్ అధికారులు వందనం గ్రామంలోని భూమి సర్వే నిర్వహించారు.ఈ సర్వేలో అరెకరం భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఇంటోన్మెంట్ ఇన్స్పెక్టర్ సమత,ఈఓ రామకృష్ణ,రామలింగేశ్వర స్వామి చైర్మన్ పొన్నం శంకర్, వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, గ్రామస్తులు రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# పాత పద్ధతిలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

- పత్రికలకు జిల్లాకు 4 అక్రిడేషన్ కార్డులు ఇస్తామంటే తిరస్కరించిన కమిటీ....
- ఎం ప్యానల్ లో ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టు కు కార్డులు ఇవ్వాలని అక్రిడేషన్ కమిటీ తీర్మానం...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 19,**ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు.మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు.పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు కార్డులు అందిస్తా మని డి పి ఆర్ ఓ ప్రస్తావన తీసుకురాగా జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు.
కమిటీ సభ్యులకు ప్రస్తుతం అక్రిడేషన్ కార్డులు అవసరం లేదని జిల్లాలోని అన్ని మండలాల వారీగా వివిధ పత్రికలలో దరఖాస్తు చేసుకున్న మండలాల రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు ఇచ్చినప్పుడు మా కమిటీ సభ్యులను కూడా తీసుకుంటామని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు.
జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వం నిబంధన ప్రకారం పెద్ద పత్రికలు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తమ జిల్లా వ్యాప్తంగా మండలాలలో చిన్నప్పుడే ఆ నాలుగు కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు.ఎం ప్యానల్ ఉన్న ప్రతి పత్రికకు ఎలక్ట్రానిక్,కేబుల్ ఛానెల్ లకు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు.కమిటీ సభ్యుల నిర్ణయాలకు స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్ కు అన్యాయం జరగకుండా చూస్తామని మీకు సంబంధించిన డిమాండ్లు ఏమైనా ఉంటే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాల తోపాటు ఎలక్ట్రానిక్ మీడియా కు జిల్లాలో 9 కార్డులు,కేబుల్ చానళ్లకు కూడా జిల్లా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్ కు అందించారు. తీర్మానం చేసిన కాపీని కలెక్టర్ తీసుకుని ఐ ఎండ్ పి ఆర్ కమిషనర్ తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు కల్లోజీ శ్రీనివాస్, బి వి. రమణారెడ్డి, వట్టి కొండ రవి, ఎం ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్ రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న..

- సహాయం కోరిన వెంటనే స్పందన..
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులందించిన తీన్మార్ మల్లన్న!



**సికే న్యూస్ ప్రతినిధి:** జనగామ/భువనగిరి: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి (జవీ=ఖీ) ఎంతో ఆసరాగా నిలుస్తోందని టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన చామకూర చంద్రయ్యకు రూ.24,000, యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపురానికి చెందిన లింగం కృష్ణకు రూ.48,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు.ప్రభుత్వం నుండి సాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకుని, త్వరగా చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు...

## రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నాం.

- జిల్లా కలెక్టర్ అంకిత్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 19,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, హమాలీ, రవాణా తదితర ఏర్పాట్లు సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు .

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు మొత్తం 3,76,288 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 2,19,729.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో 1,56,558.5 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు .

మంగళవారం ఒక్కరోజులోనే 10,091.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు తెలిపారు. రవాణా కోసం 458 లారీలు, 131 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అదనంగా మరో 1,50,000 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

యెల్లందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, జూలూరుపాడు, గుండాల, అల్లపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్నను త్వరితగతిన గోదాములకు తరలిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని అన్నారు .

రైతుల ఖాతాల్లో చెల్లింపులు వేగంగా జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆ ప్రకటనలో తెలిపారు.

## చిన్ననాటి మిత్రులు ఒకేచోట కలిసిన శుభవేళ

- స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం
- 1990 - 1991 ఎస్ఎస్సి బ్యాచ్ గెట్ టూ గెథర్ సందడి



**సి కే న్యూస్ షాద్ నగర్ :మే 19:** స్నేహం అంటే ఇలా ఉండాలి అన్నట్టు 1990–1991 ఎస్ఎస్సి బ్యాచ్ చిన్ననాటి మిత్రులు గెట్ టూ గెథర్ ప్రోగ్రామ్ షాద్ నగర్ పట్టణం లోని మా కన్వెన్షన్ లో కలిసిమెలిసి జరుపుకున్నారు. అందరు చిన్ననాటి స్నేహితులు ఒకేచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు, ముచ్చట్లు, కలిసి చేసిన సరదాలు పంచుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్బంగా స్నేహితులు అందరు తమ తమ అనుభవాలు పంచుకుంటూ ఎల్లప్పుడూ అందరు ఇలాగే మళ్ళీ మళ్ళీ కలుసుకోవాలని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# పేదల జోలికి వస్తే ఊరుకోం: వట్టే జానయ్య యాదవ్ హెచ్చరిక



**సి కె న్యూస్ ప్రతినిది సూర్యాపేట:** సూర్యాపేటలో పేదల భూములు, ఇళ్ల నిర్మాణాల విషయంలో జరుగుతున్న అన్యాయాలను సహించబోమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నల్లు ఉమా జ్యోతి రెడ్డి, నల్లు చిత్రరంజన్ రెడ్డి పై కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. జగదీశ్వర్ రెడ్డి ప్రోత్సాహంతో అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. లక్షల రూపాయల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అని హెచ్చరించారు. చట్టపరమైన అంశాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, పేద ప్రజలు కష్టపడి నిర్మించుకుంటున్న ఇళ్లపై పరోక్షంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే అన్ని పత్రాలతో ప్రజల ముందుకు వస్తామని స్పష్టం చేశారు. భూవివాదంలో సంబంధం ఉన్న వారందరిపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వట్టే జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లే సైదులు, కుంభం వెంకన్న యాదవ్, మధు, చాప్లా, రాగం లింగయ్య, చింత సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగులవంచ క్లస్టర్ లోని రైతులతో రైతు అవగాహన కార్యక్రమం...





**సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి :** మండల పరిధిలో నాగులవంచ క్లస్టర్ లోని రైతులతో మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. వర్షాకాలం సమీపిస్తున తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపిక లో జాగ్రత్త వహించాలి. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలుచేయాలి. కొనుగోలు సమయంలో బిల్లును తప్పనిసరిగా తీసుకోండి, బిల్లుపై డీలర్ మరియు రైతు సంతకాలు ఉండాలి. బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోండి, అవసరం అయినప్పుడు ఇది ఆధారంగాఉపయోగపడుతుంది. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన, మంచి దిగుబడి ఇచ్చే, మార్కెట్లో పేరు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే ఎంచుకోండి. లైసెన్స్ లేని వ్యాపారుల వద్ద నుంచి కొనుగోలు చేయవద్దు, గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే, బిల్లులు ఇవ్వని వ్యాపారులను చూసిన వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వండి. గడ్డి మందు తట్టుకునే రకాలు అంటూ బీ.టీ. విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వండి. ఇవి భారత ప్రభుత్వం నుంచి అనుమతి లేని విత్తనాలు తయారీ, విక్రయమే కాకుండా కొనుగోలు చేసిన రైతు కూడా చట్ట పరంగా బాధ్యత వహించాల్సివుంటుంది.

ఎవరైనా డబ్బు అడ్వాన్సుగా తీసుకుంటూ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయండి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సోములపల్లి మానస, నాగులవంచ క్లస్టర్ ాజుూ కళ్యాణి మరియు రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలపై నేడు కలెక్టరేట్ ముందు ధర్నా

**వ్యవసాయ మండల కార్యదర్శి వత్సవాయి జానకి రాములు**



**సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి :** మే 20వ తారీకు జరగబోయేటువంటి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల మీద కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం భాగంగా చింతకాని నర్సాపురం లచ్చగూడెం కుదుమూరు గ్రామాల ఉపాదామి కూలీలను కలవడం జరిగింది పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి రెండుసార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలి బిల్లును రద్దుచేసి మహాత్మా గాంధీ ఉపాధి హామి చట్టాన్ని ఉంచాలి పట్టణ పేదలకు ఉపాధి పని పెట్టాలి ఉపాదాన్ని పని 200రోజులు కల్పించాలి రోజు కూలి 600 పెంచాలి ఉపాధి హామీ కూలీలకు ఆత్మీయ భరోసా కింద 12000 ఇస్తామన్న హామీ అమలు చేయాలి ఇన్సూరెన్స్ కేంద్ర ప్రభుత్వం భరించాలి ఈ సమస్యల మీద మాట్లాడి 20వ తారీకు జరగబోయే ధర్నాకు అందరూ హాజరు కావాలని చెప్పారు వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి వత్సవాయి జానకిరాము లు వ్యవసాయ కార్మిక మండల అధ్యక్షులు దేశ బోయిన ఉపేందర్ చింతకాని పార్టీ సెక్రెటరీ గడ్డం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి





**తొలుత కమిటీ సభ్యులకు, జిల్లాకు 4 కార్డులు ఇస్తామంటే తిరస్కరించిన కమిటీ**

**ఎమ్ పానల్ లో ఉన్న పత్రికల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టు కు కార్డులు ఇవ్వాలని కమిటీ తీర్మానం**

**సి కె న్యూస్ ప్రతినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :** ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం ఈరోజు అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు కార్డులు అందిస్తామని డి పి ఆర్ ఓ ప్రస్తావన తీగ జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. తమకు కార్డు ప్రస్తుతం అవసరం లేదని జిల్లాలోని మండలాల రిపోర్టర్లకు కార్డు నందించినప్పుడే తాము కూడా తీసుకుంటామని స్పష్టం చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వం నిబంధన ప్రకారం పెద్ద పత్రికలు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తమ జిల్లా వ్యాప్తంగా మండలాల్లో చిన్నప్పుడే ఆ నాలుగు కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు. ఎం పానల్లో ఉన్న ప్రతి పత్రికకు ఎలక్ట్రానిక్ ఛానల్లకు, కేబుల్ ఛానల్కు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్కును అన్యాయం జరగకుండా చూస్తామని మీకు సంబంధించిన డిమాండ్లు ఏమైనా ఉంటే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో, కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాల తోపాటు ఎలక్ట్రానిక్ మీడియా కు జిల్లాలో 9 కార్డులు, కేబుల్ చానళ్లకు కూడా డిస్ట్రిక్ట్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్ కు అందించారు. తీర్మాన కాపీని స్వీకరించిన కలెక్టర్ ఐ ఎన్ పి ఆర్ కమిషనర్ తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు కల్లోజీ శ్రీనివాస్, బి వి. రమణారెడ్డి, వట్టి కొండ రవి, ఎం ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్ రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత.

రాష్ట్ర నాయకులు వాకిటి ఆనంత రెడ్డి సౌజన్యంతో.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 19.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో అరూర్ గ్రామంలో ఐలపాక నర్సమ్మ గారు అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి ఈరోజు ఆరూరు గ్రామంలో ఐలపాక స్వామి కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, దామెర అంజయ్య, బుర్ర శ్రీశైలం, వేముల అనిల్ కుమార్, భోగరం ధర్మయ్య, పోలేపాక నర్సింహా, బుర్ర శివ, పుట్టల కృష్ణ,నల్ల రాజు,చాడా నర్సింహ్మా,బోలుగుల రాజు, చాడా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తిర్లాపురం గ్రామంలో జూనియర్ ఎన్టీఆర్ బర్త్డే సెలబ్రేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు.


నేడు తిర్లాపురం గ్రామం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని తిర్లాపురం గ్రామం లోని నేడు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బర్త్డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, తిర్లాపురం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రావట్ల ఉపేందర్ రావు, సభ్యులు, ఫ్యాన్స్,ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతుంది. కావున నందమూరి అభిమానులు, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్, యువతీ యువకులు, అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిర్లాపురం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జిల్లాలో 13,661 మత్స్యకార కుటుంబాలకు రూ.27.32 కోట్ల ఆర్థిక సాయం.

● కలెక్టర్ విజయ్ కృష్ణన్



**అనకాపల్లి మే 19 సి కె న్యూస్ ప్రతినిధి** వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద అనకాపల్లి జిల్లాలో మొత్తం 13.661 అర్హులైన మత్స్య కార కుటుంబాలకు రూ.27 కోట్ల 32 లక్షల 20 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది.జిల్లాలోని పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, మత్స్యకార కుటుంబాలు వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందన్నారు.మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మత్స్యకారుల ఆదాయం పెంపు కోసం సీవీడ్ సాగు వంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

ప్రతి సంవత్సరం చేపల సంరక్షణ కోసం అమలు చేసే 61 రోజుల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. జిల్లాలో నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి.

పెందుర్తి నియోజకవర్గంలో 960 మంది మత్స్యకారులకు రూ.1.92 కోట్లు, ఎలమంచిలి నియోజకవర్గంలో 4,352 మంది మత్స్యకారులకు రూ.8.7 కోట్లు పాయకరావుపేట నియోజకవర్గంలో 8,349 మంది మత్స్యకారులకు రూ.16.69 కోట్లు ఆర్థిక సాయం జమైంది.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ జెడ్పీటీసీ , సర్పంచ్, మండల కోపరేటివ్ సభ్యులు, మత్స్యకారులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మోద కొండమ్మ ముగింపు జాతర మహోత్సవం.

● భక్తుల కోలాహలం నడుమ సాగిన ఊరేగింపు.
● జాతరలో పాల్గొన్న కలెక్టర్ జేసి ఐటిడిఏ పిఓ ఆలయ కమిటీ అధ్యక్షులు.





**పాడేరు మే 19 సి కె న్యూస్ ప్రతినిధి** శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా భక్తుల కోలాహలం నడుమ ఘనంగా ఊరేగింపు సాగింది.అమ్మవారి ముగింపు ఉత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమం భక్తజన సందోహాన్ని విశేషంగా ఆకట్టుకుంది.?ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ పాడేరు ఎమ్మెల్యే ఆలయ కమిటీ అధ్యక్షులు మచ్చరస విశ్వేశ్వర రాజు ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరిలు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహం అమ్మవారి పాదాలు ఘట్టాలతో పురవీధులలో వివిధ కళాకారుల నృత్యాలతో, డప్పు వైద్యాలతో, కళ కారులతో

ఊరేగింపు పొడవునా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు, నృత్యాలు భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. కోలాటాలు భజనల నయనానందకరంగా సాగింది.

?ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, ఆలయ కమిటీ, మరియు పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# "భరోసా పార్టీ అధినేత అభినయ్ దర్శన్‌పై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ నాయకులు"

**సి కె న్యూస్ ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాడేరు ఏజెన్సీ ప్రాంతం, గూడెం కొత్త వీధి మండలం, మొండిగడ్డ పంచాయతీ పరిధిలోని నీరుతోటపాలెం గ్రామం వద్ద భరోసా పార్టీ అధినేత అభినయ్ దర్శన్ గారిపై జరిగిన దాడి ఘటనను ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ -- ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ హై కమీషనర్ డా. సిహెచ్ విజయ్ మోహన్ రావు మాట్లాడుతూ:

"ఈ ఘటన మా దృష్టికి రాజకీయ దాడిగా వచ్చినది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజా సమస్యలపై పనిచేసే వ్యక్తులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరం. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.

అలాగే ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డిప్యూటీ హై కమీషనర్ డా. సిహెచ్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ:

"హింస, బెదిరింపులు, దాడులు ఏ సమస్యకూ పరిష్కారం కావు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమాజంలో శాంతి భద్రతలకు ముప్పుగా మారుతుంది. ప్రతి పౌరుడి భద్రతను కాపాడడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. బాధితులకు తగిన రక్షణ కల్పించి, సంఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలి" అని తెలిపారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ -- ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ డా. పీటర్ నాయక్ లకావత్ మాట్లాడుతూ:

"ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజా సమస్యలపై పనిచేసే వ్యక్తులపై దాడులు జరగడం అత్యంత బాధాకరం. ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన మార్గాల్లో పనిచేసే హక్కు ఉంది. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ హింసకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానం లేదు" అని పేర్కొన్నారు.

గ్రామస్థుల కథనం ప్రకారం, అభినయ్ దర్శన్ ఆధ్వర్యంలో 'భరోసా' పార్టీ తరఫున గత కొంతకాలంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజా సమస్యలను తెలుసుకునే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చింతపల్లి వైపు వెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు వారి వాహనాన్ని అడ్డుకుని దాడి చేసినట్లు బాధితులు తెలిపారు.

ఈ ఘటనలో కిరణ్ జార్జ్, సుదర్శన్ స్వల్ప గాయాలతో బయటపడగా, అభినయ్ దర్శన్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై పూర్తి స్థాయిలో సమగ్రమైన దర్యాప్తు జరిపి, నిందితులను వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని మరియు పోలీసు శాఖను కోరుతున్నారు..

అలాగే ఈ సున్నితమైన అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు.









చివరగా వారు మాట్లాడుతూ:

"హింస ఎప్పటికీ సమస్యలకు పరిష్కారం కాదు. ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన, శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుంది. సమాజంలో శాంతి, భద్రతలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.

# జాతరకు భారీ సంఖ్యలో బస్సు సర్వీసులు.




జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనువాసురావు.

**పాడేరు మే 19 సి కె న్యూస్ ప్రతినిధి** పాడేరు మోదకొండమ్మ రాష్ట్ర గిరిజన జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సు సర్వీస్లు నడుపుతున్నామని భక్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస రావు అన్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు ఉచిత రవాణా సదుపాయం స్త్రీ శక్తి పథకం ద్వారా అన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్ లలో అందించబడుతుందన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు అదనపు బస్సులు నడపటం జరుగుతుందని, పాడేరు మిగతా బస్ కాంప్లెక్స్ లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా వారి సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. త్రాగునీరు,మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.

# అన్న క్యాంటిన్ లు "పేదలకు ఒక వరం"

టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఉంగటి.రమణ మూర్తి

**శ్రీకాకుళం మే19 సి కె న్యూస్ ప్రతినిధి** అన్న క్యాంటిన్ పేదలకు ఒక వరమని టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఉంగటి.రమణ మూర్తి అన్నాడు. ఆయన

మనవడు బైరి పూర్వాన్స్ జన్మదినం సందర్భంగా అన్న క్యాంటిన్ లో ఉచిత అన్నవితరణ చేపట్టారు. పేదలకు అన్నప్రసాదాన్ని అందించారు. మాట్లాడుతూ పేదల పాలిటి పెన్నిధి అన్న ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ, అదే ధోరణిలో రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నార.చంద్ర బాబు నాయుడు, అన్న కాంటీన్ రూపంలో పేదల కడుపు నింపుతున్నారని, రాష్ట్రంలో ఎక్కడా ఆకలి కేకలు వినిపించని విధంగా అడుగులు వేశారన్నారు. నగరంలో ఏడు రోడ్ల కూడలిలో ప్రతి నిత్యం సుమారు 7వందల మంది అన్న కాంటీన్ లో ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని, నిజంగా శ్రీకాకుళం జిల్లాకే కాక, రాష్ట్ర ప్రజలకు ఇదొక వరమనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. నా మనవడు పూర్వాన్స్, తల్లితండ్రులు బైరి.శ్రీనివాస్, రమ్య, నానమ్మ అన్నపూర్ణ, శారద, సత్యవతి, రాకేష్, వెంకట్, ఆదిత్య ఇతర కుటుంబ సభ్యులు సహకరించారని, మా కుటుంబ సభ్యులంతా అన్నదాన సేవలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు.

ఈ సేవా కార్యక్రమంలో శ్రీకాకుళం మునిసిపల్ కమీషనర్ హనుమంతు కూర్మారావు, కాంటీన్ చైర్మన్ గుమ్మా.రఘురామ్, గుప్త, అన్నకాంటీన్ నిర్వాహకురాలు జి.పద్మావతి, సమాజ సేవకులు ఉర్లం.శివతేజ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన భ్రూణ హత్య ఆరోపణలు..

- భర్త అనుమతి లేకుండా తప్పుడు పత్రాలతో భార్యకు అబార్షన్..
- హాస్పిటల్, డయాగ్నస్టిక్ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి: శివకుమార్

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, సి కె న్యూస్ ప్రతినిధి** .:హైదరాబాద్ నగరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన భ్రూణ హత్య ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. భర్త అనుమతి లేకుండా తప్పుడు పత్రాలతో తన భార్యకు అబార్షన్ నిర్వహించారని ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ విజయపురి కాలనీకి చెందిన శివకుమార్ ఆరోపించారు. ఈ ఘటనలో హిమాయత్‌నగర్ లోని రెయిన్బో హాస్పిటల్, కర్మన్‌ఘాట్‌లోని టెస్లా డయాగ్నస్టిక్ సెంటర్ వైద్యుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేశారు. శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2024 మార్చి 30న పున్న హారికతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అనంతరం 2025లో హారిక గర్భవతి కావడంతో చింతలకుంటలోని రెయిన్బో హాస్పిటల్‌లో ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకుంటూ వచ్చామని, శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పినట్లు తెలిపారు. శ్రీమంతం షాపింగ్ విషయంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంతో హారిక పుట్టింటికి వెళ్లిపోయిందని, తిరిగి కాపురానికి రావాలని పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ క్రమంలో హారిక తండ్రి పున్న బిక్షపతి తన అనుచరులతో కలిసి ఇంటిపైకి వచ్చి బెదిరింపులకు పాల్పడటమే కాకుండా బలవంతంగా కొన్ని పత్రాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. తన భార్యకు అబార్షన్ చేయించేందుకు ఆసుపత్రికి వచ్చి సంతకం చేయాలని ఒత్తిడి తెచ్చారని, అనంతరం తెలిసిన వారి ద్వారా అబార్షన్ జరిగిపోయిందని తెలుసుకున్నానని శివకుమార్ వాపోయారు. ఈ విషయమై 2025 మే 30న సరూర్‌నగర్ పోలీసులను ఆశ్రయించినా స్పందన లభించలేదన్నారు. తరువాత ఎల్బీనగర్ డీసీపీని కలవగా కేవలం ట్రెస్‌పాస్ కేసు మాత్రమే నమోదు చేశారని, భర్త అనుమతి లేకుండా అబార్షన్ నిర్వహించిన అంశంపై కేసు నమోదు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతో మళ్లీ పోలీసులను ఆశ్రయించగా విచారణ ముందుకు సాగిందన్నారు. అనంతరం అప్పటి మల్కాజ్గిరి కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో అదనపు డీసీపీ కోటేశ్వరరావుకు కేసు అప్పగించినట్లు తెలిపారు. ఇక హిమాయత్‌నగర్ రెయిన్బో హాస్పిటల్‌ను సంప్రదించగా.. కర్మన్‌ఘాట్‌లోని టెస్లా డయాగ్నస్టిక్ సెంటర్ నుంచి వచ్చిన రిపోర్టుల ఆధారంగానే అబార్షన్ నిర్వహించామని ఆసుపత్రి సిబ్బంది చెప్పినట్లు శివకుమార్ తెలిపారు. దీనిపై టెస్లా డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రశ్నించగా, రేడియాలజిస్ట్ డాక్టర్ స్రవంతి తమ సహచర వైద్యుడు డాక్టర్ దిడ్డి వంశీ కిరణ్ సూచన మేరకే రిపోర్ట్ ఇచ్చినట్లు తెలిపారని అన్నారు. డాక్టర్ దిడ్డి వంశీ కిరణ్ తన భార్య సొంత అక్క భర్త కావడంతో, తన పరిచయాలను ఉపయోగించి తప్పుడు వైద్య ధృవపత్రాలు ఇప్పించి, రెయిన్బో హాస్పిటల్‌లో పరిచయమైన డాక్టర్ స్వాతి ద్వారా అక్రమంగా అబార్షన్ చేయించారని శివకుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలకు ప్రయత్నిస్తున్నామని తెలుసుకున్న తరువాత, దిడ్డి వంశీ కిరణ్ కుటుంబ సభ్యులు తమను బెదిరిస్తున్నారని, ప్రాణహాని హెచ్చరికలు చేస్తున్నారని కూడా ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, తప్పుడు ధృవపత్రాల ఆధారంగా అబార్షన్ నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, వైద్యాధికారులను శివకుమార్ కోరారు.






## సంపాదకీయం


# అణు అంచున మధ్యప్రాచ్యం

మధ్యప్రాచ్యంలో రగులుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైన మలుపు తీసుకున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబి సమీపంలో ఉన్న బరాకా అణు విద్యుత్కేంద్రంపై ఆదివారం రాత్రి జరిగిన డ్రోన్ దాడి ప్రపంచ దేశాల వెన్నులో వణుకు పుట్టించింది. ఈ దాడిని భారత్ తక్షణమే ఖండించడం, "ఇలాంటి చర్యలు అంగీకరించదగ్గవి కావు" అని విదేశాంగ శాఖ స్పష్టంగా ప్రకటించడం సముచితం. యూఏఈ విదేశాంగ శాఖ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, తమ సార్వభౌమత్వంపై దాడి జరిగితే దౌత్య, సైనిక హక్కులు తమకు ఉన్నాయని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ దాడి వెనుక ఉన్నది ఎవరో యూఏఈ స్పష్టంగా చెప్పలేదు. కానీ గత కొన్ని వారాలుగా ఇరాన్, యూఏఈ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో యూఏఈ చురుకైన పాత్ర పోషిస్తోందని ఇరాన్ చేసిన ఆరోపణలు ఈ దాడి వెనుక ఉన్న కథను సూచిస్తున్నాయి.

బరాకా అణు విద్యుత్కేంద్రం యూఏఈకి సాధారణ విద్యుత్ ప్లాంట్ కాదు. ఆ దేశ ఇంధన భద్రతకు, ఆర్థిక భవిష్యత్తుకు, వాతావరణ లక్ష్యాలకు మూలస్తంభం. ఎమిరేట్స్ న్యూక్లియర్ ఎనర్జీ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఈ కేంద్రంలోని నాలుగు ఏపీఆర్1400 రియాక్టర్లు ఏడాదికి 40 టెరావాట్ గంటల విద్యుదుత్పత్తి చేస్తాయి. యూఏఈ మొత్తం విద్యుత్ అవసరాల్లో ఇది 40 శాతం. అంతేకాదు, ప్రతి ఏడాది దాదాపు 22.4 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను నివారించే హరిత ఇంధన వనరు ఇది. అంటే 48 లక్షల కార్లను రోడ్లపైనుంచి తొలగించడంతో సమానం. ఇటువంటి కీలక మౌలిక సదుపాయంపై దాడి అంటే అది ఒక దేశ ఆర్థిక గుండెకాయపై దాడి చేసినట్టే. ఇంతేకాదు, ఇది అంతర్జాతీయ అణు భద్రతా నిబంధనలను నిర్దాక్షిణ్యంగా ఉల్లంఘించడం. అణు రియాక్టర్లపై దాడులు ఎన్నడూ ఉండకూడదని, అణు సదుపాయాలు అన్ని పక్షాలకూ "నిషిద్ధ ప్రాంతం"గా ఉండాలని జెనీవా ఒప్పందాలు, అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. ఎందుకంటే ఒక చిన్న పొరపాటు, ఒక తప్పుదారి పట్టిన క్షిపణి లేదా డ్రోన్ వల్ల చెర్నోబిల్, ఫుకుషిమా తరహా విపత్తు జరగడానికి ఎక్కువ సమయం పట్టదు. మధ్యప్రాచ్యం వంటి జనసాంద్రత ఎక్కువ ఉన్న, పర్యావరణ సున్నితత్వం కలిగిన ప్రాంతంలో అటువంటి విపత్తు పర్యవసానాలు ఊహించడానికే భయంగా ఉంటుంది. ఇటీవలి యుద్ధంలో ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రంపై కనీసం నాలుగు క్షిపణులతో దాడి జరిగిందని ఐఏఈఏకు ఇరాన్ తెలిపింది. ఇప్పుడు యూఏఈలోని బరాకా. మధ్యప్రాచ్యం అంతటా అణు కేంద్రాలు సైనిక లక్ష్యాలుగా మారిపోతున్న ఈ పోకడ ప్రపంచ శాంతికి అత్యంత ప్రమాదకరమైన సూచిక. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం, యూఏఈ విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్‌తో ఆయన ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడడం, ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలున్న సౌదీ అరేబియా కూడా దాడిని ఖండించడం ఈ ముప్పు తీవ్రతను ధృవీకరిస్తోంది. భారత్ దృష్టి కోణం నుంచి చూస్తే ఈ పరిణామాలు మరింత ఆందోళనకరమైనవి. యూఏఈలో దాదాపు 35 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. భారత్-యూఏఈ ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని గల్ఫ్ ప్రాంతం నుంచే తీర్చుకుంటోంది. ఈ ప్రాంతంలో అస్థిరత పెరిగితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రవాస భారతీయుల భద్రతపై, ఇంధన భద్రతపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. చమురు ధరల అస్థిరత దేశీయ ద్రవ్యోల్బణానికి దారి తీయవచ్చు; షిప్పింగ్ మార్గాల్లో అడ్డంకులు ఎగుమతి-దిగుమతి సంబంధాలను దెబ్బతీయవచ్చు.

అందుకే భారత్ నిష్పక్షపాత వైఖరిని కొనసాగిస్తూనే, మరింత చురుకైన దౌత్య పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఇరాన్‌తో శతాబ్దాల పాటు సాగిన నాగరికత సంబంధాలు, యూఏఈతో పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇజ్రాయెల్‌తో దృఢమైన మిత్రత్వం - ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించగల అరుదైన దేశం భారత్. ఈ సాధ్యత భారత్‌కు ఒక బాధ్యత కూడా. ప్రధాని నరేంద్ర మోదీ ఒకసారి అన్నట్టు "ఇది యుద్ధాల యుగం కాదు" అనే మాటలు ఇప్పుడు మరోసారి బలంగా ప్రతిధ్వనించాల్సిన సమయం. అంతర్జాతీయ సమాజం వెంటనే రెండు కీలక చర్యలు తీసుకోవాలి. ఒకటి, అణు సదుపాయాలపై ఎటువంటి దాడులు చేయరాదన్న కట్టుబాటును అన్ని పక్షాలతో పునరుద్ఘాటించాలి. దీని కోసం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించడం, ఐఏఈఏ ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం అవసరం. రెండు, ప్రస్తుత ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ ఘర్షణకు దౌత్యమార్గంలో శాశ్వత పరిష్కారం కనుగొనడం. ఇరాన్ తన పౌర-సైనిక లక్ష్యాల మధ్య సరిహద్దు రేఖను స్పష్టంగా గుర్తించాలి. యూఏఈలోని అమెరికా-ఇజ్రాయెల్ సైనిక స్థావరాలను మాత్రమే లక్ష్యం చేసుకుంటామని చెప్పి, చివరికి ఒక అణు విద్యుత్ ప్లాంట్‌ను తాకడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది యుద్ధ నీతిని ఉల్లంఘించడమే కాదు, మానవత్వానికీ ద్రోహం చేయడమే. మరోవైపు, యూఏఈ సహా గల్ఫ్ దేశాలు తమ గగన రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు, ఇతర దేశాల వివాదాల్లో పరోక్ష పక్షపాత పాత్రను తిరిగి సమీక్షించుకోవాలి.

ప్రాంతీయ స్థిరత్వం అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత. చిన్న చిన్న ఉద్రిక్తతలు పెరిగి అణు విపత్తులకు దారి తీయకుండా చూసుకోవడం ప్రతి ప్రభుత్వం, ప్రతి నాయకుడి కర్తవ్యం. మానవ చరిత్రలో అణు శక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించడం ఒక గొప్ప విజ్ఞాన విజయం. దానిని యుద్ధ క్షేత్రంగా మార్చడం అదే విజ్ఞానానికి జరిగే అతిపెద్ద అవమానం. బరాకా దాడి ఒక హెచ్చరిక గంట. ఈ గంట శబ్దం వినిపించని పక్షంలో మరో దాడి, మరో అవకాశం వచ్చిన తర్వాత మనం పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. అప్పటి కథ ఇంత మృదువుగా ముగియకపోవచ్చు. కాబట్టి భారత్ సహా అన్ని శాంతి కాముక దేశాలు తక్షణం రంగంలోకి దిగాలి. చర్చల బల్ల వద్ద పరిష్కారం వెతకాలి. ఎందుకంటే అణు యుగంలో యుద్ధానికి విజేత ఉండడు; కేవలం ప్రాణాలతో మిగిలి ఉండేవారు, మరణించిన వారు మాత్రమే ఉంటారు. ఈ సత్యాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే ప్రపంచానికి అంత మంచిది.



# నిర్లక్ష్యం చేస్తే.. నిప్పుపై నడకే!

ప్రస్తుత ఆధునిక కాలంలో పురుషుల్లో 'బర్నౌట్' అనేది ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారుతోంది! ఇది కేవలం మానసిక ప్రశాంతతను మాత్రమే కాకుండా.. శారీరక ఆరోగ్యాన్ని కూడా పూర్తిగా దెబ్బతీస్తోంది. సుదీర్ఘ పనివేళలు, ఆర్థిక ఒత్తిళ్లు, సరిగ్గా నిద్రపోకపోవడం, నిరంతర ఆందోళన, డిజిటల్ స్క్రీన్ల వాడకం వల్ల చాలా మంది పురుషులు మానసికంగా, శారీరకంగా పూర్తిగా నీరసించిపోతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బర్నౌట్ అంటే కేవలం "అలసటగా అనిపించడం" కాదు. ఒత్తిడి అనేది శరీరంలో దీర్ఘకాలికంగా ఉండిపోయినప్పుడు, అది కార్టిసాల్ అనే హార్మోన్ స్థాయిలను పెంచుతుంది. ఇది నిద్రను పాడుచేసి, రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. అంతేకాకుండా రక్తపోటు (బీపీ) పెరగడానికి, ఆందోళన, డిప్రెషన్, గుండె జబ్బులు, జీవక్రియ లోపాలకు దారితీస్తుంది. వీటితోపాటు కొందరిలో తలనొప్పి, కడుపునొప్పి (జీర్ణ సమస్యలు), కండరాల నొప్పులు, చిరాకు, ఎమోషనల్ నంబ్‌నెస్ (భావోద్వేగాలు లేనట్లు అనిపించడం)వంటి లక్షణాలు కనిపిస్తాయి. సమస్య ఏంటంటే.. చాలామంది పురుషులు దీని ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తారు. ఆరోగ్యం, బంధాలు, రోజువారీ పనులు దెబ్బతినే వరకు ఒత్తిడిని భరిస్తూనే ఉంటారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరంలోని 'ఫైట్-ఆర్-ఫ్లైట్' (ఫైట్ లేదా ఫ్లైట్ రెస్పాన్స్) వ్యవస్థ నిరంతరం చురుగ్గా ఉంటుంది. దీనివల్ల కార్టిసాల్, అడ్రినలిన్‌వంటి ఒత్తిడి హార్మోన్లు విపరీతంగా పెరిగిపోయి, శరీరంలోని వివిధ అవయవాలపై సైలెంట్‌గా ప్రభావం చూపిస్తాయి.

బయటపడేందుకు 6 మంత్రాలు:

1. అత్యంత శక్తివంతమైన రికవరీ టూల్ -నిద్ర. నిద్రలేమి, బర్నౌట్ ఒకదానికొకటి ముడిపడి ఉన్న ఒక ప్రమాదకరమైన చక్రంలాంటివి. ఒత్తిడివల్ల నిద్ర పట్టదు. నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడి హార్మోన్లు మరింత పెరుగుతాయి. అందుకే ఒక పక్కా నిద్ర షెడ్యూల్ పాటించడం, రాత్రిపూట మొబైల్ స్క్రీన్లు చూడటం తగ్గించడంవల్ల మానసిక, ఫిజికల్ రెసీలియన్స్ మెరుగవుతుంది.

2. చెమట చిందించండి: వ్యాయామంలో విడుదలయ్యే ఎండార్ఫిన్లు సహజ యాంటీ-డిప్రెసెంట్లు. నడక, సైక్లింగ్, వెయిట్స్ - ఏదైనా సరే, రోజూ తప్పనిసరి.

3. మానసిక ఒత్తిడిని దాచొద్దు: చాలామంది పురుషులు తమ మానసిక అలసటను లేదా భావోద్వేగాలను బయటకు చెప్పకుండా లోపలే అణచివేస్తుంటారు. కానీ ఇలా చేయడం వల్ల మానసిక స్థిరత్వంతోపాటు శారీరక ఆరోగ్యం కూడా క్షీణిస్తుంది. నిరంతర చిరాకు, బంధాలకు దూరం కావడం, పనిపై ఆసక్తి లేకపోవడంవంటి లక్షణాలను అస్సలు లైట్ తీసుకోవద్దు. ఈ ఒత్తిడివల్ల కొందరు మద్యం, ధూమపానం, అతిగా తినడం లేదా ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండిపోవడంవంటి అలవాట్లకు బానిసలవుతుంటారు.


4. ప్లేటు మార్చండి: ప్రాసెస్డ్ ఫుడ్, అధిక కెఫిన్, ఆల్కహాల్‌కు దూరం. ప్రోటీన్లు, తృణధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, నీరు - ఇవే మెదడుకు ఇంధనం.

5. మెదడుకు బ్రేక్: నాన్‌స్టాప్ పనితో నరాలు ఎప్పటికీ 'ఆన్'లోనే ఉంటాయి. చిన్న విరామాలు, హాబీలు, ప్రకృతిలో సమయం, డిజిటల్ డిటాక్స్ - విలాసాలు కాదు, అవసరాలు.

6. సహాయం అడగడం బలహీనత కాదు: లక్షణాలు నిద్ర, పని, బంధాలు, ఆకలిని తీవ్రంగా తాకుతున్నాయా? థెరపిస్ట్/కౌన్సిలర్‌ను సంప్రదించడం ఉత్తమం. ప్రారంభ దశలో పరిష్కారం - పెద్ద జబ్బుగా మారకుండా కాపాడుతుంది.

గుర్తుంచుకోండి: బర్నౌట్‌ను దాటడం అంటే బాధ్యతల నుంచి పారిపోవడం కాదు - శరీరానికీ, మనస్సుకూ సమంగా చోటు ఇవ్వడమే!

# సాగునీటికి కాలబద్ధ ప్రయోగం



భారతదేశంలో సాగునీటి ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి సాగుతూ ఉండటం ఒక సంప్రదాయంగా మారిపోయింది. ఒక ప్రాజెక్టు మొదలైతే అది ఎప్పుడు పూర్తవుతుందో, ఎన్ని తరాల రైతులు ఎదురుచూస్తారో అన్న ప్రశ్నే మిగులుతుంది. శంకుస్థాపన ఒక ముఖ్యమంత్రి చేస్తే, ప్రారంభోత్సవం మరో ముఖ్యమంత్రి -కొన్నిసార్లు మరోతరం ముఖ్యమంత్రి చేయడం దేశంలో సాధారణ దృశ్యం. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన 'ఇరిగేషన్ క్యాలెండర్' అనే భావన నిజంగా ఒక ప్రయోగాత్మక పాలనా ప్రణాళిక. కాలపరిమితి, ప్రాధాన్యతా క్రమం, నిధుల లభ్యత - ఈ మూడింటినీ ఒకే చట్రంలోకి తీసుకువచ్చి సాగునీటి రంగాన్ని పునర్నిర్మించాలనే ఆలోచన నిస్సందేహంగా ఆహ్వానించదగినది.

కలెక్టర్ల కాన్ఫరెన్సులో తొలుత 25 ప్రాజెక్టులతో ప్రకటించిన ఈ క్యాలెండర్‌లో, తాజా సమీక్షలో మరో 11 ప్రాజెక్టులు చేరడంతో మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు సిద్ధమయ్యాయి. భూసేకరణ, సివిల్ వర్క్సుకు నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశం ఈ ప్రణాళికకు ప్రాణం పోసే అంశం. ఎందుకంటే ప్రాజెక్టులు ఆగిపోవడానికి ప్రధాన కారణం నిధుల ప్రవాహంలో అంతరాయమే. క్యాలెండర్ అనే భావనకు అర్థం ఉండాలంటే ప్రతి దశకు అవసరమైన వనరులు ఆ సమయానికి అందుబాటులో ఉండాలి. ఈ సూత్రాన్ని గుర్తించడం ప్రభుత్వ పరిణతిని తెలియజేస్తుంది.

పోలవరం -ముఖ్యమైన పరీక్ష

ఈ క్యాలెండర్‌లో పోలవరం ప్రాజెక్టు పునఃప్రారంభం ఒక ముఖ్య ఘట్టం. సివిల్ వర్క్సు 88 శాతం, భూసేకరణ 93 శాతం, నిర్వాసితుల తరలింపు 45 శాతం -ఈ గణాంకాలు చూస్తే ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంటోందని అనిపిస్తుంది. డయాఫ్రాం వాల్ నిర్మాణం ఈ ఏడాది ఏప్రిల్ 2నాటికే పూర్తి కావడం, ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తి కావడం వంటి పురోగతి స్వాగతించదగినవి. అయితే ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి, నిర్వాసితుల తరలింపు 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం పెద్ద సవాలే. ప్రతి నెలా పనుల పురోగతిని ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షిస్తానని ప్రకటించడం -ఇది ఈ సవాలును ఎదుర్కొనే నిబద్ధతను సూచిస్తోంది.

ఈ ఏడాది జూలై నుంచే పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువకు నీరు అందించాలన్న లక్ష్యం రైతులకు తక్షణ ఊరట. మేఘాద్రిగడ్డ నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకూ నీళ్లు తీసుకువెళ్లే అంశంపై అధ్యయనం చేయాలన్న సూచన ఉత్తరాంధ్ర జిల్లాలకు భవిష్యత్ హామీ. పోలవరం స్పిల్‌వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం, బెస్ట్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి అనే ఆలోచనలు సాగునీటి ప్రాజెక్టులను కేవలం వ్యవసాయానికే కాకుండా బహుళార్థ సాధక కేంద్రాలుగా మార్చే దృష్టికోణాన్ని ప్రతిబింబిస్తున్నాయి. నీళ్లు, పంటలు, విద్యుత్, పర్యాటకం -ఒకే మౌలిక సదుపాయం నుంచి బహుళ ఫలితాలు రాబట్టే ఆలోచన ఆర్థికంగా కూడా అర్థవంతమే.

వెలిగొండ నుంచి హంద్రీనీవా దాకా

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ఈ ఏడాది జూలైనాటికి పూర్తి కావాలన్న లక్ష్యం రాయలసీమ -ప్రకాశం జిల్లాల కరువు పీడిత ప్రాంతాలకు పెద్ద ఊపిరి. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) తొలగించి అడ్డంకులు లేకుండా పనులు ముందుకు తీసుకువెళ్లడం, మరో రూ.2019 కోట్ల అవసరాన్ని బహిరంగంగా గుర్తించడం -ఇవి సమస్యలను దాచిపెట్టకుండా ఎదుర్కొనే విధానాన్ని తెలియజేస్తున్నాయి. హంద్రీనీవా ఫేజ్-1లో కాలువల వెడల్పు 92 శాతం, ఫేజ్-2లో కుప్పం-పుంగనూరు లైనింగ్ 85 శాతం పూర్తి కావడం, మల్యాల లిఫ్ట్ నుంచి తొలిసారిగా 52 టీఎంసీ నీటిని రాయలసీమకు తరలించడం -ఇవి కాగితంపై ఉన్న ప్రాజెక్టులు వాస్తవంలో రూపుదిద్దుకుంటున్నాయని చెప్పే నిదర్శనాలు.

లిఫ్ట్ స్కీంలు -తిరోగమనం నుంచి పునరుజ్జీవనం

ఈ సమీక్షలో అత్యంత గమనించదగిన అంశం -లిఫ్ట్ స్కీంల పునరుద్ధరణ. 2014-19 మధ్య కాలంలో నిర్వహణ, మరమ్మతులకు తగిన నిధులు కేటాయించిన లిఫ్ట్ స్కీంలు, 2019-24 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో సుమారు 362 స్కీంలు నిర్వీర్యమయ్యాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పునరుద్ధరణ చర్యలతో ప్రస్తుతం 156 స్కీంలు సంపూర్ణంగా, 505 స్కీంలు పాక్షికంగా పని చేస్తున్నాయి. గతంలో సుమారు 10 లక్షల ఎకరాలకు లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటిని అందించిన చరిత్ర ఉంది.


ఇది కేవలం రాజకీయ విమర్శ కాదు. ఇది ఒక విధాన పాఠం. ఏ ప్రభుత్వం వచ్చినా మౌలిక సదుపాయాల నిర్వహణకు బడ్జెట్ కేటాయింపులు నిరంతరం ఉండాలి. ఎందుకంటే ఒకసారి నిర్మించిన మౌలిక సదుపాయం నిర్వీర్యమైతే, దాన్ని పునరుద్ధరించడానికి కొత్త నిర్మాణానికి అయిన దానికంటే ఎక్కువ ఖర్చు, ఎక్కువ సమయం పడుతుంది. మధ్యలో ఆ స్కీంలపై ఆధారపడిన రైతులు అనుభవించే నష్టం ఎలాగూ లెక్కకే రాదు. ఈ గుణపాఠాన్ని భవిష్యత్ ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు గుర్తుంచుకుంటే రైతులకు మేలు జరుగుతుంది. మౌలిక సదుపాయాలకు పార్టీలు లేవు, రాజకీయ రంగులు లేవు - ఈ సూత్రాన్ని పాలనా సంస్కృతిలో భాగంగా చేయాల్సిన అవసరం ఉంది.

క్యాలెండర్ -ఒక పాలనా తత్వశాస్త్రం

ఇరిగేషన్ క్యాలెండర్ అన్నది కేవలం ఒక పత్రంలో ఉన్న టైంటేబుల్ కాదు. అది ఒక పాలనా తత్వశాస్త్రం. కాలపరిమితి విధించుకోవడం, ప్రాధాన్యతలను నిర్దేశించుకోవడం, ప్రతి నెల పురోగతిని సమీక్షించడం, నిధుల కొరత లేకుండా చూడటం, లిఫ్ట్ స్కీంల పునరుద్ధరణ, నీటి-విద్యుత్ నెక్సస్ గుర్తింపు, ప్రజల భాగస్వామ్యం -ఈ అన్ని అంశాలను ఒక సమగ్ర చట్రంలోకి తీసుకువచ్చి అమలు చేయడం ఒక సాహసోపేత ప్రయోగం.

ఈ ప్రయోగం విజయవంతం కావాలంటే మూడు షరతులు అవసరం. మొదటిది -రాజకీయ నిరంతరత. ఎంత మంచి విధానమైనా ప్రభుత్వాలు మారినప్పుడు మారిపోకూడదు. ఇరిగేషన్ క్యాలెండర్ చంద్రబాబు ప్రభుత్వ క్యాలెండర్‌గా మాత్రమే మిగిలిపోకుండా, రాష్ట్ర క్యాలెండర్‌గా మారాలి. రెండవది -ఆర్థిక క్రమశిక్షణ. ప్రకటనలు చేసి నిధులు అందించకపోతే క్యాలెండర్ కాగితంపైనే ఉండిపోతుంది. మూడవది -సాంకేతిక నిష్ణాతత. ఇంజినీరింగ్ లోపాలు, ప్రాజెక్టు డిజైన్ లోపాలు భవిష్యత్‌లో సమస్యలు సృష్టించకుండా చూడాలి. ప్రతి ప్రాజెక్టుకు ఇంపాక్ట్ స్టడీ చేయాలన్న ముఖ్యమంత్రి సూచన ఈ దిశలో సరైనదే.

ఈ మూడు షరతులూ నెరవేరితే, ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ క్యాలెండర్ ప్రయోగం ఈ రాష్ట్రానికి మాత్రమే కాదు, దేశానికి ఒక నమూనాగా నిలవగలదు. రైతుల పొలాల్లో నీరు పారాలి. వారి కళ్లలో ఆశ నిలవాలి. క్యాలెండర్ తేదీలు పాటించాలి. అప్పుడే ఈ ప్రయోగానికి అర్థం. అప్పుడే ఈ ప్రణాళికకు సార్థకత. క్యాలెండర్‌లో నీళ్లు ఉండటం కాదు -పొలాల్లో నీళ్లు ఉండాలి. అదే తుది గీటురాయి! ■



మనపై మనం నమ్మకం పెంచుకుంటూనే ఉండాలి. సాధించగలనని మనసుకు నచ్చచెప్తూనే ఉండాలి. ఇతరుల సందేహాలను లెక్కపెట్టకుండా ముందుకు సాగుతూనే ఉండాలి. వీటన్నిటికీ అనుగుణంగా మైండ్ మ్యాపింగ్ చేస్తూనే ఉండాలి. అలా.. పెంచుకోవడం, నచ్చజెప్పుకోవడం.. ముందుకు సాగుతామని అనుకోవం.. ఇవన్నీ ఒకెత్తు.. ఆ నమ్మకాన్ని నిరూపించుకోవడం మరో ఎత్తు. ఎంత ధైర్యం కూడగట్టుకున్నా.. ఎంత స్ఫూర్తి నింపుకున్నా.. అడుగు ముందుకు వేయనంతవరకూ నమ్మకం మాటలకే పరిమితం. చేసి చూపించిన క్షణమే అది విశ్వాసంగా మారుతుంది.


-మహాదేవ

వింతల్లో వింతలు

# మార్కెటింగ్ డ్రెస్ కోడ్



చైనాలోని యాంటై రాత్రి బజారులో ఒక బండి దగ్గర వేడివేడి స్టిర్ ఫ్రై తయారవుతోంది. బాణలి తిప్పుతోంది ఎవరో తెలుసా? లుంగీ-బనియన్‌లో కాదు -పక్కా బిజినెస్ సూటు, టై సహా వేసుకున్న 19 ఏళ్ల కుర్రాడు! పేరు షియావో లూ. హోదా -"స్టిర్ ఫ్రై సీఈఓ"! 17 ఏళ్ల వయసునుంచే నాన్నతో కలిసి బండి నడుపుతున్నాడు. పక్కన పదుల సంఖ్యలో పోటీ బండ్లు. తనను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవాలి కదా -అని తొలుత ఒక వెస్ట్ తొడిగాడు. జనం 'వావ్' అన్నారు. ధైర్యం పెరిగి కోటు, ప్యాంటు, టై - పూర్తి కార్పొరేట్ గెటప్‌లోకి దిగాడు. ఫలితం -డోయిన్ (చైనా టిక్‌టాక్)లో వైరల్! ఇప్పుడు సాయంత్రం 5నుంచి రాత్రి 11:30 దాకా 200 ప్లేట్లు. మూడు నిమిషాలకొక సర్వింగ్. ఒక్కోసారి రెండు బాణలులు ఏకకాలంలో. జపాన్ ఎనిమె 'వన్ పీస్'లోని శాంజీ క్యారెక్టర్‌ను తలపిస్తున్నాడని అభిమానుల మాట. దేశం నలుమూలల నుంచి జనం వంటకోసం కాదు, లుక్ కోసం వస్తున్నారు! "కుతూహలంతో వస్తారు. రుచితో తిరిగివెళ్తారు' అంటాడీ సూట్‌బూట్ చెఫ్. మన పానీపూరి బండి బాబాయిలూ ఈ ట్రెండ్ గమనించండి -'డ్రెస్ కోడే మార్కెటింగ్'!





# సరికొత్త ట్రెండ్.. రామాయణ

రణ్‌బీర్ కపూర్ హీరోగా నితీష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న 'రామాయణం' చిత్రం ఏకంగా 10,000 మందికి పైగా క్రూతో ఇండియన్ సినీ హిస్టరీలోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్‌ఈజీ మరియు యష్‌కి చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రానుంది. పార్ట్-1 2026 దీపావళికి, పార్ట్-2 2027 దీపావళికి విడుదల కానున్నాయి. హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గకుండా విదేశీ నిపుణులు, సరికొత్త టెక్నాలజీ, భారీ సెట్స్‌తో ఇండియా మరియు విదేశాల్లో సినిమా షూటింగ్ జరుపుకుంటోంది.


గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా, పక్కా రీసెర్చ్‌తో విజువల్ వండర్‌గా ఈ మైథలాజికల్ ఎపిక్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు. కన్నడ స్టార్ యష్ రావణాసురుడి పాత్ర పోషిస్తూనే ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు.

# 'ఇర్రీప్లేసబుల్'

టాలీవుడ్ యంగ్ అండ్ స్టార్ కపుల్ విజయ్, రష్మికలు తమ ప్రేమని పెళ్లి వరకు తీసుకెళ్లి ఇపుడు హ్యాపీ లైఫ్‌ని లీడ్ చేస్తోన్న విషయం తెలిసిందే. లేటెస్ట్‌గా రష్మికకి సంబంధించి కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో నెటిజన్స్ దృష్టిని ఆకర్షించాయి. రష్మిక మందన్న మోచేతిపై కనిపించిన ఓ సరికొత్త పచ్చబొట్టు వైరల్‌గా మారింది. అయితే ఇది చూసిన నెటిజన్స్ మాత్రం రష్మికకి విజయ్ అంటే ఇంత ప్రేమ ఉందా? అని ఆశ్చర్యపోతున్నారు. మరి అంతలా ఏం రాయించుకుంది అంటే.. 'ఇర్రీప్లేసబుల్' అంటూ ఆమె చేతికి కనిపించింది. అంటే 'ఎవరూ నీ స్థానాన్ని భర్తీ చేయలేరు' అన్నట్టుగా రష్మిక తన ప్రేమని విజయ్‌పై ఈ రేంజ్‌లో వ్యక్తం చేయడం అనేది ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇక ఈ ఇద్దరి కలయికలో ప్రస్తుతం 'రణబాలి' సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఈ ఏడాదిలో విడుదల కానుంది.



# 'పెద్ది' గ్రాండ్ ఈవెంట్‌కు సిద్ధం



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్టును నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్ఎల్ గ్రౌండ్సులో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్టు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగులో ఉందని పేర్కొంది. చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.

## పోస్టర్!




# అప్పుడు సామ్.. ఇప్పుడు జాన్వీ

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' చిత్ర ట్రైలర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. పల్లెటూరి నేపథ్యంతో కూడిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ట్రైలర్ విడుదలైనప్పటి నుండి, ఇందులోని జాన్వీ రూరల్ లుక్ మరియు యాసను చూసి నెటిజన్లు ఆమెను 'రంగస్థలం'లో సమంత పోషించిన ఐకానిక్ పాత్రతో పోలుస్తున్నారు. ట్రైలర్‌లో జాన్వీ పల్లెటూరి అమ్మాయి పాత్రలో ఒదిగిపోవడానికి గట్టి ప్రయత్నమే చేసింది. కొన్ని సీన్స్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుంది. అయితే, మరికొందరు ప్రేక్షకులు మాత్రం డైలాగ్ డెలివరీ మరియు ఎమోషనల్ సీన్స్‌లో ఆమె నటన మరింత మెరుగ్గా ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, ఈ క్రేజీ ప్రాజెక్ట్ గనక బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్‌లో జాన్వీ కెరీర్‌కు ఇది ఒక పెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారుతుంది. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో గట్టి హైప్ ఉంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న 'పెద్ది' చిత్రం జూన్ 4న గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.




# రాజాకు 'కరుప్పు' టీం సారీ..

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 'కరుప్పు' టీమ్ క్షమాపణలు చెప్పింది. సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం తెలుగులో వీరభద్రుడు పేరిట విడుదలైంది. ఈ చిత్రంలో ఇళయరాజా డైలాగుపై టీమ్ తాజాగా పోస్ట్ పెట్టింది. ఇందులో ఇళయరాజాను ఉద్దేశిస్తూ ఉన్న డైలాగులను తొలగిస్తున్నట్టు పేర్కొంది. ఆయనను కించపరచడం తమ ఉద్దేశం కాదంటూ నోట్ విడుదల చేసింది. "ఇళయరాజా అంటే మాకు ఎంతో గౌరవం ఉంది. సినీరంగం కోసం ఆయన చేస్తున్న సేవలు ఎన్నోతరాల్లో స్ఫూర్తి నింపుతున్నాయి. కరుప్పులో ఆయనను ఉద్దేశిస్తూ ఉన్న డైలాగు వల్ల ఆయన బాధపడ్డారని మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో ఆయనను క్షమాపణలు కోరుతున్నాం. ఆయన మనోభావాలను దెబ్బతీయడం, అగౌరవపర్చడం మా ఉద్దేశం కాదు. ఈ చిత్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనను ఉద్దేశిస్తూ ఉన్న డైలాగులను తొలగిస్తున్నాం.

ఈరోజునుంచి ఈ మార్పు చేస్తున్నాం. ఆయన గౌరవమే మాకు ప్రధానం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ సినిమా తమిళ వెర్షన్ సెకండాఫ్‌లోని ఓ సన్నివేశంలో బ్యాగ్రౌండ్‌లో విజయకాంత్ సినిమాలోని పాట వినిపిస్తుంది. ఆ నేపథ్యంలో పాటల హక్కులపై వచ్చే సంభాషణలు పరోక్షంగా ఇళయరాజాను కించపర్చేలా ఉన్నట్లు విమర్శలు వచ్చాయి. దీంతో నిర్మాణ సంస్థ ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ క్షమాపణలు తెలియజేసింది.



# మీరంతా ఉండగా.. ఒంటరిని ఎలా అవుతా?

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ తాను ఒంటరిగా ఉన్నానంటూ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ వైరలైన విషయం తెలిసిందే. దీంతో ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆ వైరల్ పోస్టుపై సల్మాన్ ఖాన్ స్పందించారు. ఆ మెసేజ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. ఆ పోస్టును హైలైట్ చేస్తూ హెడ్‌లైన్స్‌గా మార్చడంతో తన తల్లి కంగారుపడిందని అన్నారు. "నేను నా గురించి మాట్లాడలేదు. అయినా.. ఇంత పెద్ద కుటుంబం, ఇంతమంది స్నేహితులు ఉన్నప్పుడు నేను ఎలా ఒంటరివాడిని అవుతాను? మీ అందరి ప్రేమాభిమానాలు నాకు తోడుగా ఉంటే నేను ఒక్కడినే అనే భావన నాలో ఎందుకు వస్తుంది. మీరంతా నాతో ఉంటున్నా.. అలా అనుకుంటే నేను కృతజ్ఞత లేనివాడిని అవుతాను. నా కోసం కొంచెం సమయం కేటాయించుకోవాలనిపించిందంతే. దాన్ని మీరంతా హైలైట్ చేశారు. కనీసం ఫొటో కూడా పెట్టకుండానే మీరు దీన్ని బ్రేకింగ్ న్యూస్ చేసేశారు. మా అమ్మ కూడా నన్ను 'ఏమైంది నాన్న?' అని అడుగుతోంది. ప్లీజ్.. రిలాక్స్ అవ్వండి ఫ్రెండ్స్" అని ఆయన స్పష్టతనిచ్చారు. తాజాగా సల్మాన్ ఖాన్ తన షర్ట్స్ ఫొటోను షేర్ చేస్తూ ఒంటరితనం గురించి ఒక నోట్ రాశారు. అది క్షణాల్లో వైరల్ అయింది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటు వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు.

